అగ్నిలహరి

సుంకరి రాంప్రసాద్

"ట్వెన్ మిలియన్ ఎన్స్."

"ఇట్స్ టూ మచ్ హోచిమిన్. ఇంకో మాట చెప్పు."

"అబ్దుల్లా! ఈ హోచిమిన్ ఎప్పుడూ రెండు మాటలు చెప్పడు. నీకు కష్టంగావుంటే చెప్పు. అదే రేటుకు కళ్ళకు అద్దుకుని మరీ తీసుకోడానికి మరో పార్టీ సిద్ధంగా వుంది."

అది టోక్యోలో షెరటాన్ హొటల్ పన్నెండవ అంతస్తులోని లగ్జరీ సూట్. ఆ గదిలోని మెత్తని సోఫాలలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు అబ్దుల్లా, హోచిమిన్ అనబడే ఇద్దరు వ్యక్తులు.

అబ్దుల్లా సౌదీ అరేబియాకు చెందిన పెద్ద స్మగ్లర్. వివిధ దేశాలలోని ప్రాచీన శిల్పాలను, కళాఖండాలను సేకరించి, గల్ఫ్ కంట్రీస్‌లోని అరబ్ షేకులకు అమ్మటం అతడు చేసే ప్రధానమైన వ్యాపారం.

ఈ యాంటిక్స్ కోసం అరబ్ షేక్‌లు ఎందుకు ఇలా మిలియన్ల కొద్దీ పెట్రో డాలర్లను వృధాగా తగలేస్తారోనని అప్పుడప్పుడు ఆశ్చర్యపోతూంటాడు అతడు.

ఆఫ్టరాల్ ఇట్స్ ఎ క్రేజ్. వారి క్రేజ్‌ను అతను కేష్ చేసుకోగలుగుతున్నాడు.

ఇక రెండవ వ్యక్తి హోచిమిన్.

ఇతడి గూర్చి చెప్పేముందు 'యాకుజా' అంటే యేమిటో చెప్పాల్సి వుంటుంది. ఇరవై ఒకటవ శతాబ్దంలో చీకటి ప్రపంచాన్ని పరిపాలిస్తున్న నేరస్తుల రాజ్యాన్ని మాఫియా అని పిలుస్తారు. ది మోడరన్ క్రిమినల్ గాంగ్ ఇన్ ద అండర్ వరల్డ్ సొసైటీ.

ప్రపంచంలోని ఒక్కొక్క దేశంలో ఈ మాఫియా రింగ్ ఒక్కొక్క పేరుతో పిలవబడుతూంది. జపాన్‌లోని ఈ మాఫియా సామ్రాజ్యాన్ని యకుజా అంటారు. అలాంటి యకుజాకు మకుటం లేని మహారాజు హోచిమిన్.

అబ్దుల్లాను పది మిలియన్ల ఎన్‌లు యివ్వమని (జపాన్ కరెన్సీని 'ఎన్' లని వ్యవహరిస్తారు.) హోచిమిన్ డిమాండ్ చేస్తున్నాడంటే దానికి అబ్దుల్లా కోరుతున్న ప్రతిఫలం సామాన్యమైనదేమీ కాదు.

అతడు కోరుతున్నది....

మౌంట్ ఫ్యూజీ మీదనున్న పురాతన దేవాలయంలోని పంచలోహ విగ్రహం. గౌతమబుద్ధుడు ధ్యానముద్రలో కూర్చుని ఉన్నట్లుగా మలచబడ్డ ఆ విగ్రహం ప్రపంచంలో అత్యంత సుందరమైన బుద్ధప్రతిమగా పేరు గాంచింది.

“మీకు ఆ విగ్రహాన్ని యెక్కడ అందించాల్సి

ఉంటుంది అబ్దుల్లా?"

"టోక్యోకు సుమారు నూట అరవై కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న మియాకి దీవికి మీరా విగ్రహాన్ని చేర్చాల్సి వుంటుంది. మీరు ముందుగా ఇన్‌ఫార్మ్ చేస్తే ఆ సమయానికి అక్కడ మా స్టీమ్‌బోటు ఒకటి సిద్ధంగా ఉంటుంది. అక్కడ నుండి దానిని షిఫ్ట్ చేసే బాధ్యత మాది."

"ఇట్స్ డన్ అబ్దుల్లా."

హోచిమిన్ వైపు మెచ్చుకోలుగా చూశాడు అబ్దుల్లా. అంతవరకు తన వడిలో పెట్టుకున్న చిన్న బ్రీఫ్ కేసును నవ్వు మొహంతో హోచిమిన్‌కు అందించాడు. బ్రీఫ్ తెరచి చూసిన హోచిమిన్ మొహం.... అందులో నీట్‌గా పేర్చబడ్డ తళ, తళ లాడుతున్న సరికొత్త జపాన్ కరెన్సీని చూసేసరికి ఒక్కసారిగా వెలిగిపోయింది.

"టూ మిలియన్ ఎన్స్ హోచిమిన్. మిగిలింది ....పని పూర్తయ్యాక.... మియాకి దీవిలో" అన్నాడు అబ్దుల్లా.

సరే నన్నట్లు మెల్లగా తలాడించాడు హోచిమిన్. కాని తాను ఒప్పుకున్న ఈ ఎసైన్‌మెంట్ ఎంత ప్రమాద భరితమైనదో అతడికి ఆ క్షణంలో తెలియదు.

2

అది ఒక విశాలమైన గది. అందులో అర్ధచంద్రాకారంలో వేయబడ్డ కుషన్ చైర్స్‌లో కూర్చుని వున్నారు పదిమంది వృద్ధకాయులు.

టోక్యోలోని 'యకుజా' గాంగ్ అత్యవసర సమావేశానికి పిలవబడ్డారు ఆ పదిమంది వృద్ధకాయులు. వారి ఎదురుగా మూడడుగుల దూరంలో చిన్న వేదికలా వుంది.

ఎర్రని వెల్వెట్ క్లాత్ పరచివున్న ఆ వేదికమీద కుర్చీలలో కూర్చుని వున్నారు ముగ్గురు వ్యక్తులు.

వారు హోచిమిన్, చిన్ లీ. తోషిబా.

యకుజాకు రాజు హోచిమిన్ అయితే, మంత్రిలాంటి వాడు చిన్ లీ. అతడు హోచిమిన్ కు కుడిభుజం. ఇక తోషిబా జపాన్ దేశంలోనే పేరు కెక్కిన జియాల జిస్ట్ ...

అబ్దుల్లాతో మౌంట్ ఫ్యూజీమీద పంచలోహ విగ్రహం తేవటానికి ఒప్పుకున్నాక, ఈ ఎసైన్ మెంట్ కోసమే ప్రత్యేకంగా ప్రొఫెసర్ తోషిబా రప్పించబడ్డాడు.

జపాన్ లోని ఎందరో ప్రొఫెసర్లూ, ప్రభుత్వోద్యోగులతో పాటు, ఎందరో పోలీసు ఉన్నతాధికారులు కూడా 'యకుజా గాంగ్ సభ్యులే అన్నది నమ్మశక్యం కాని నిజం.

ఆ గది అంతా నిశ్శబ్దంగా వుంది. తమ నాయకుడు చెప్పబోయే మాటలను వినడానికి వారు చెవులను రిక్కించి మరీ కూర్చున్నారు. హోచిమిన్ కనుసైగ నందుకుని చిన్ లీ మెల్లగా కుర్చీలోంచి లేచి చెప్పడం ప్రారంభించాడు.

"డియర్ ఫ్రెండ్స్! మన ఎసైన్ మెంట్ .... మౌంట్ ఫ్యూజీ అని మీ కందరకూ తెలుసు. టోక్యోకు నైఋతి దిక్కున సుమారు 300 కిలోమీటర్ల దూరంలో వుంది ఫ్యూజీ పర్వతం. మనం 250 కిలోమీటర్ల వరకూ ట్రైన్ లో, ఆ తరువాత ట్రక్ లో ప్రయాణించాల్సి వుంటుంది.

"మీరంతా ఇద్దరేసి చొప్పున ఐదు జట్లుగా విడి

పోండి. రేపు ఉదయం ఆరు గంటలకు టోక్యో నుండి నగోయాకు వెళ్ళే ట్రైన్ ఎక్కండి. సరిగ్గా ఎనిమిదిన్నరకు మిమ్మల్ని నగోయా స్టేషన్‌లో దింపుతుంది ఆ ట్రైన్. స్టేషన్‌లో దిగాక మీరు విడివిడిగా ప్రయాణించాల్సి వుంటుంది.

నగోయా సిటీలోని హోటల్ 'సాకీ'లో మీ పేర రూమ్స్ రిజర్వ్ చేయబడ్డాయి. మళ్ళీ ఫర్దర్ ఇన్‌స్ట్రక్షన్స్ యిచ్చేటంతవరకూ హాయిగా మీకు కేటాయించబడ్డ గదుల్లో విశ్రాంతి తీసుకోండి. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం... మీరు ఒకరినొకరు ఎట్టి పరిస్థితులలోనూ పలుకరించుకోకూడదు. బీ కేర్‌ఫుల్."

అంతటితో ఆ సమావేశం పూర్తయింది అన్నట్లు హోచిమిన్ లేచి నిలబడ్డాడు. తమ నాయకుడికి వినయంగా లేచి నిలబడి జై చేస్తూ ఆ గదిలో నుండి నిష్క్రమించారు ఆ యకుజా సభ్యులు.

3

నగోయా రైల్వేస్టేషన్.

వచ్చేపోయే పాసెంజర్లతో హడావుడిగా వుంది. స్టేషన్ యెదురుగా ఉన్న రెస్టారెంట్‌లో కూర్చుని తీరిగ్గా ఫ్రాగ్స్ కబాబ్ తింటున్నాడు ఒహీరా. తన స్నేహితుడికి సెండాఫ్ చెప్పడం కోసం వచ్చాడతడు. స్నేహితుడిని ట్రైన్ యెక్కించేసి రెస్టారెంట్‌లో కూర్చున్నాడు.

ఒహీరా జపాన్ సీక్రెట్ సర్వీసెస్‌లో జూనియర్ ఆఫీసరుగా యీ మధ్యనే రిక్రూట్ అయ్యాడు. నగోయా సిటీలో పోస్టింగ్ వేశారతడికి. శాంతి భద్రతల దృష్ట్యా ప్రతి సిటీలో ఒక సీక్రెట్ సర్వీసు ఆఫీసరు వుంచబడ

కాదు జపాన్‌లో.

ఫ్రాగ్స్ కబాబ్ తింటూ స్టేషన్ వైపే చూస్తూన్న ఒహీరా ఆశ్చర్యంతో నుదురు చిట్లించాడు. రైల్వేస్టేషన్ నుండి ఒక్కొక్కరుగా బయటకు వచ్చారు పదిమంది దృఢకాయులు. విడి విడిగా కాబ్స్ (అద్దె టాక్సీలు) ఎక్కి వెళ్ళిపోయారు. వారి ఆకారాలు, చూపులు, ఆ నడకలోని రఫ్‌నెస్ అన్నీ వారు యకుజా గాంగ్ సభ్యులని స్పష్టంగా చెబుతున్నాయి.

'ఇంతమంది యకుజా గాంగ్ మనుషులు, ద మోస్ట్ రఫ్ కారెక్టర్స్ ఆఫ్ జపాన్....ఒక్కసారిగా నగోయా సిటీలోనికి యెందుకు దిగినట్లు? అని కాదు ఒహీరా ఆశ్చర్యపోతున్నది. కనిపించగానే ఆప్యాయంగా చేతులు కలుపుకునే యజూజా సభ్యులు కనీసం ఒకరినొకరు చూసుకోకుండా అంత సీరియస్‌గా ఎక్కడికి వెళుతున్నట్లు?' అని.

బిల్ పే చేసి రెస్టారెంట్ బయట పార్కు చేసివున్న తన 'హోండా'ను స్టార్టు చేశాడు ఒహీరా. ఒకవేళ వాళ్ళు యకుజా ముఠా మనుషులు కారేమోనన్న అనుమానం వచ్చింది అతడికి. చివరి దృఢకాయుడెక్కిన కాబ్ అతడికి స్పష్టంగా కనిపిస్తూంది. పదిగజాల దూరం నుండి దానిని వెంబడించసాగాడతడు.

తిన్నగా వెళ్ళి హోటల్ సాకీ ఆవరణలో ఆగింది ఆ కాబ్. అదే సమయంలో అంతకు ముందే తమ ప్యాసంజర్లను దింపేసి వెనుకకు మరలుతున్నాయి ఆ మిగిలిన దృఢకాయులెక్కిన కాబ్‌లు.

హోటల్ రిసెప్షన్‌లో తన ఐడెంటిటీని చూపించి వారి గూర్చి ఎంక్వయిరీ చేశాడతడు. రెండు రోజుల

క్రితమే ఆ పదిమంది పేరా రూమ్స్ రిజర్వ్ చేయబడ్డాయని తెలిసింది.

'తను అనవసరంగా వారిని అనుమానిస్తున్నాడా' అన్న సందేహమేమైనా అతడి మనసులో ఉంటే అది ఆ క్షణంలో పటాపంచలయిపోయింది. 'సంథింగ్ ఈజ్ రాంగ్' అనుకున్నాడతడు. ఆ వృద్ధకాయులకు రూమ్స్ కేటాయించబడ్డ ఫ్లోర్ లోని తనకు కూడా ఒక రూమ్ తీసుకున్నాడతడు.

రాత్రి ఎనిమిది దాటింది.

అతడిలో అసహనం చచ్చిపోతూంది. ఉదయం నుండీ అతను యెంతో జాగ్రత్తగా వారిని గమనిస్తున్నాడు. ఆ పదిమందిలో యే ఒక్కరూ రూమ్స్ నుండి కదలలేదు. ఆఖరికి భోజనం కూడా గదికే తెప్పించుకున్నారు. కనీసం ఎవరికీ ఫోన్ కూడా చేయలేదు.

అతడు ఉదయమే రూమ్ సర్వీసింగ్ బాయ్ వేషంలో ఆ పదిమంది వృద్ధకాయుల గదులలో ప్రవేశించి, రూమ్ క్లీన్ చేస్తున్నట్లు నటిస్తూ వారి గదులలో హియరింగ్ బగ్స్ అమర్చి వచ్చాడు. అతడి గదిలో వున్న హైపవర్ ట్రాన్స్‌మీటర్ వారి గదుల్లో చీమ చిటుక్కుమన్నా రిసీవ్ చేసుకుని అతడికి వినిపిస్తూంది.

కాని రాత్రి ఎనిమిది కావస్తున్నా.... వారు ఎవరినీ కాంటాక్ట్ చేయలేదు.

అతడు అసహనంగా సోఫాలోంచి లేచాడు. అదే సమయంలో ప్రాణం పోసుకున్నట్లు ట్రాన్స్‌మీటర్ పలకసాగింది.

"టక్....టక్....టక్...."—ఎవరో తలుపు కొట్టిన ధ్వని.

"హూ ఈజ్ దట్?" వృద్ధకాయుని గొంతు కంచులా మోగింది.

"సప్పర్ ఫర్ యూ సర్!"

'హోటల్ బాయ్ గొంతులా వుంది' అనుకున్నాడతడు శ్రద్ధగా ట్రాన్స్‌మీటర్‌లోని మాటలు వింటూ. కాసేపు టీపాయ్‌మీద యేవో ప్లేట్లు సర్దుతున్న చప్పుడు. కొన్ని సెకన్లపాటు నిశ్శబ్దం.

ఎవరో చిన్నగా దగ్గారు.

"బుద్ధుడు ఉండాల్సింది కొండల్లో కాదు" మెల్లగా గొణుగుతున్నట్లు పలికింది హోటల్ బాయ్ గొంతు.

చిన్నగా నవ్వాడు ఆ వృద్ధకాయుడు. అతని గొంతు మెల్లగా పలికింది "సముద్రపు దీవి"లో.

"ప్రభాతాన్ని ఆ మహాశ్రమణున్ని దర్శించండి. బుద్ధా బ్లెస్ యూ" మంద్రంగా వినిపించింది వెయిటర్ గొంతు. తరువాత అతడు గదిలో నుంచి వెళ్ళిపోయినట్లు అడుగుల చప్పుడు.

సరిగ్గా పదిమంది గదులలోనూ యివే మాటలు. ఒక్క అక్షరం పొల్లుపోకుండా, అందరూ కూడబలుక్కున్నట్లుగా. అందరి గదులలోనూ రూమ్ బాయ్ యివే మాటలన్నాడు.

ఇది వాళ్ళు యేర్పరుచుకున్న కోడ్ అని స్పష్టంగా తెలుస్తోంది. కాని యేమిటా అన్నదే చాలా సేపటివరకూ అంతుపట్టలేదు ఒకీరాకు. పేపర్ తీసి వ్రాసుకొని జాగ్రత్తగా స్టడీ చేయసాగాడతడు ఆ మాటల్ని.

బుద్ధుడు వుండాల్సింది కొండల్లో కాదు,
సముద్రపు దీవిలో.
ప్రభాతాన్ని ఆ మహాశ్రమణున్ని దర్శించండి.

బుద్ధా బ్లెస్ యూ...."

చాలాసార్లు చదివాడతడు.

కానీ.... ఏమీ అర్థం కావటంలేదు.

ఎంత ఆలోచించినా అతనికి అర్థమవుతోంది ఒక్కటే. మొదటి రెండు లైనులూ యేదో ఎక్సైన్ మెంట్ ను సూచిస్తున్నాయి. చివరి లైను ప్రొసీడ్ కమ్మని దీవెన లేక ఆజ్ఞ అనుకొంటే ...మధ్య లైను....?

"ప్రభాతాన్ని ఆ మహాశమణున్ని దర్శించండి."

మరోమారు జాగ్రత్తగా చదివాడతడు ఆ వాక్యాన్ని.

ఉదయాన్నే ఎక్కడో కలుసుకోమ్మని సూచిస్తున్నదది. ఎక్కడ....? మహాశ్రమణుడంటే.... బుద్ధుడు. అప్పుడతడికి సడన్ గా గుర్తుకొచ్చింది ...నగోయా సిటీ పొలిమేరలలో వున్న బౌద్ధారామం. దట్టమైన దేవదారు తోపు మధ్యలో వుంది... ఆ పురాతనమయిన బౌద్ధారామం.

తన అంచనా తప్పుగాకుంటే ఈ దృఢకాయులను ఎవరో తెల్లవారుఝాము సమయంలో అక్కడ కలుసుకోబోతున్నారు. ఆ కోడ్ వర్డ్స్ గురించి ఒక అభిప్రాయానికి రాగానే అతడు ఒక్క క్షణం కూడా వృధాపరచలేదు. వెంటనే నగోయా పోలీసు కమీషనర్ ను కాంటాక్టు చేశాడు.

తను ఒంటరిగా ఆ రోజు అర్ధరాత్రి దాటాక.... ఆ బౌద్ధారామంలో దాక్కుని వుంటానని, ఒకవేళ తన అంచనా తప్పయి వారు అక్కడికి రాకపోతే.... మళ్ళీ తాను తిరిగివచ్చేంతవరకూ ఆ దృఢకాయులమీద నిఘా

చేసి వుంచమని....కమీషనర్‌ను కోరాడతడు.

ఒహీరా జీవితంలో చేసిన మొదటి తప్పు అది. దాని అతడు చాలా పెద్ద పెనాల్టీని చెల్లించవలసి వచ్చింది. పోలీసు కమీషనర్‌ను కాకుండా, తమ సీక్రెట్ సర్వీసుకు అతడు రిపోర్టు చేసి ఉంటే ...ఆ పరిస్థితులు మరోలాగ వుండేవి.

కాని అతడు రిపోర్టు చేసిన నగోయా పోలీసు కమీషనర్ యకుజా గాంగ్ మనిషి. అతడా వార్తను అప్పటి కప్పుడే తమ నాయకుడు హోచిమిన్‌కు అందజేశాడు.

ఆ సమయంలో హోచిమిన్ నగోయా సిటీలోనే వున్నాడు. చిన్‌లీ, ప్రొఫెసర్ తోషిబాలతో పాటు అతడు ప్రభుత్వ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఒక్క తోషిబా తప్ప మిగిలిన ఇద్దరూ బౌద్ధ భిక్షువుల వేషాలలో వున్నారు.

4

రాత్రి రెండు గంటలు దాటింది.

మబ్బులు పట్టిన ఆకాశంలో చుక్కలు మిణుక్కు మిణుక్కు మంటూ చూస్తున్నాయి. దట్టమైన ఆ దేవదారు తోపులో చీకటి చిక్కగా పరుచుకొంది.

అంతవరకూ బౌద్ధారామంలో దాక్కున్న ఒహీరా మెల్లగా నడుచుకుంటూ తోపులోనికి వచ్చాడు.

అంతలో చీకటిని చీల్చుకుంటూ కాంతివంతమైన వెలుగు అతడి మీదకు పడింది. నిలుచున్నవాడు నిలుచున్నట్లుగానే గాలిలోకి ఎగిరి ప్రక్కనున్న పొదలలోకి జంప్ చేశాడు. వాడిగా వున్న ముళ్ళ పొదలు అతడి శరీరం నిండా కసిగా తమ ముళ్ళను దించాయి. పళ్ళ

బిగువున బాధను అణచుకున్నాడతడు.

ఏమాత్రం కూడా కదలకుండా ఆ ముళ్ళ పొదలమధ్యే మోకాళ్ళమీద కూర్చున్నాడతడు. అంతవరకూ చెవులు గింగురు పెట్టేలా గీ పెడుతున్న చిమ్మటలు తమ నెలవుల లోనికి యేదో ప్రాణి ప్రవేశించేసరికి టక్కున నోర్లు మూసుకొన్నాయి. కాని అతడు కదలక, మెదలక శిలా విగ్రహంలా వుండేసరికి మళ్ళీ తమ సంగీతాన్ని ప్రారంభించాయి.

ఒక్కొక్క సెకను భారంగా గడుస్తూంది. ఎండుటాకులమీద ఎవరో నడుస్తున్న శబ్దం. చీకటిలో అస్పష్టంగా కదలాడుతున్న యేవో ఆకారాలు కనిపించాయి అతడికి. వారు పొడుగుపాటి బరిసెలను పట్టుకొని పొదలలో పొడిచి చూస్తున్నారు. వారు మెల్లగా అతడు దాక్కున్న పొదను సమీపించసాగారు.

వారు తను దాక్కున్న పొదను సమీపిస్తే జరిగే దేమిటో అతడికి అర్థమయ్యేసరికి అతడి శరీరం జలదరించింది.

“నో..! ఆ బరిసెలు తల శరీరాన్ని తూట్లు, తూట్లుగా పొడవకముందే తను తప్పించుకోవాలి.”

డెస్పరేట్ గా పొదలమధ్యనుండి పైకి లేచాడు ఒహీరా. మరుక్షణం నలుదిక్కులనుండి కాంతివంతమైన వెలుగు అతడిమీద ప్రసరించసాగింది. చుట్టూ చూశాడతడు. అతడికి పది అడుగుల దూరంలో బరిసెల్ని పట్టుకొని నిలబడి వున్నారు నలుగురు దృఢకాయులు. తొడ కొట్టి సింహనాదం చేస్తూ గాలిలోకి ఎగిరాడతడు.

నేలమీదకు వ్రాలిన మరుక్షణం అరచేతులను కత్తులలా బిగించి వారిని ఎదుర్కొనటానికి సిద్ధంగా నిల

బడ్డాడు. అయితే అతడు ఊహించినట్లుగా ఆ దృఢ కాయులు అతడిని ఎటాక్ చేయలేదు. మౌనంగా ప్రక్కకు తొలగిపోయారు. వారి వంక ఆశ్చర్యంగా చూశాడతడు.

ఆ దేశంలో దేవదారు కొమ్మలనుండి పక్షుల్లా నేల మీదకు వ్రాలారు ఆరుగురు వ్యక్తులు. వారు ఆపాద మస్తకం నల్లని దుస్తులు ధరించారు. వారి చేతులలోని తెల్లని స్టీల్ పెప్కవ్‌లు ఆ చీకటిలోకూడా తళ, తళా మెరుస్తున్నాయి.

రెండు చేతులతో కత్తులను పట్టుకొని ఇద్దరు వ్యక్తులు మోకాళ్ళపై కూర్చుని వున్నారు. వారి వెనుక పక్షి రెక్కల్లా అటు ఇద్దరు, ఇటు ఇద్దరు చొప్పున నిలబడ్డారు మిగిలిన నలుగురు వ్యక్తులూ.

వారి పొజిషన్ చూడగానే వారెవరో అతడికి అర మయిపోయింది. వారు నింజా ఫైటర్స్. మార్షల్ ఆర్ట్సులో అత్యంత శక్తివంతమైన ఫైటింగ్ విధానం నింజా. ఆ యుద్ధ విధానమే ప్రత్యేకంగా వుంటుంది.

ముందు ఇద్దరు నింజా ఫైటర్స్ వుంటారు. వారి వెనుకనుండి తటాలున ఇద్దరు నింజా వీరులు వచ్చి మెరుపులా శత్రువుని ఢీకొని మాయమౌతారు. వెను వెంటనే మరో యిద్దరు ఎటేక్ చేసి ప్రక్కకు తప్పుకుంటారు. ఫైనల్‌గా మిగిలిన యిద్దరూ తటిల్లతల్లా శత్రువును తాకుతూ పోతారు.

మళ్ళీ యింకో దిశలో నుండి అలాగే శత్రువుపై దాడి ప్రారంభమవుతూంది. ఎదురుపడి ఎవరూ శత్రువుతో పోరాడరు. ఒక మెరుపుతీగెలా శత్రువును మూర్కొనడం మరుక్షణంలో అదృశ్యమవడం. అదీ నింజా యుద్ధ వ్యూహంలోని ప్రత్యేకత.

వారు నేలమీద ఎలా యుద్ధం చేస్తారో చెట్ల కొమ్మలనుండికూడా అలాగే ఎటేక్ చేస్తారు - ఆకాశంలో చక్కర్లు కొట్టే డేగలు సూటిగా వ్రాలి తమ ఆహారాన్ని తన్నుకుపోయినట్లు.

ఒహీరా కూడా మార్షల్ ఆర్ట్స్‌లో ప్రవీణుడే. కాని చేతిలో ఆయుధం లేకుండా నింజా ఫైటర్స్‌ను ఎదుర్కొనడం అంటే అది ఆత్మహత్యాసదృశమే అని అతడికి బాగా తెలుసు. అదీగాక చీకటి నింజా వీరులకు వరప్రసాదం లాంటిది.

ఏం చేయాలో అతడు నిర్ణయించుకోకముందే నింజా వీరులు అతడిని ఎటాక్ చేశారు.

పది నిమిషాలపాటు కరాటే అరుపులతో, కుంగ్ ఫూ సింహనాదాలతో ఆ తోటంతా మార్మోగిపోయింది.

ఎంత వీరుడైనా ఒక్కడూ అదీ నిరాయుధుడు ఆరుగురు నింజా వీరులను ఎంతసేపని ఎదుర్కొనగలడు? అతని శరీరమంతా గాయాలతో రక్తసిక్తమయింది. అతడు నిస్త్రాణతో ముందుకు తూలాడు. అదే సమయంలో బలంగా అతడి మెడపై పడింది ఒక కత్తివేటు.

అంతే....కంఠనాళాలు తెగి రక్తం వరదలై కారుతుంటే అతడు నిర్జీవంగా నేలమీదకు వ్రాలిపోయాడు. తమ శాఖలోనే ఒక అత్యున్నతమైన పదవిని చేపట్టిన ఒక నమ్మకద్రోహి కారణంగా ఒక నిజాయితీగల పోలీస్ ఆఫీసరు విధి నిర్వహణలో తన ప్రాణాల్నే బలి పెట్టాల్సి వచ్చింది.

సరిగ్గా అతడు మరణించిన రెండు గంటల తరువాత ఆ తోపులోనుండి ఒక ట్రక్ బయలుదేరింది. ట్రక్ ముందు సీటులో కూర్చుని వున్నారు హోచ్‌మిన్,

చిన లి. తోషిబా. ట్రక్ వెనుకనున్న బాడీలో తాపీగా కబుర్లు చెప్పుకుంటున్నారు పదిమంది దృఢకాయులు—

ఆ దేవదారు తోపులో అంతకుముందే ఒహీరా శవాన్ని పాతిపెట్టిన దానికి గుర్తుగా ఆ దృఢకాయుల చేతులకు మట్టి అంటుకొని వుంది.

ఆ ట్రక్ ఫ్యూజీ పర్వతం వైపు ప్రయాణించసాగింది. వారికి దారి చూపటానికా అన్నట్లు తూర్పున అప్పుడే వేగుచుక్క పొడిచింది.

5

బాలభానుని బంగారు కిరణాలు వెచ్చగా సోకుతుంటే తెలిమంచు తెరలలో పచ్చగా వళ్లు విరుచుకుంటుంది ప్రకృతి కన్య. నింగి అంచులను తాకుతుందా అన్నట్లుగా వుంది ఎర్రగా మెరిసిపోతున్న ఫ్యూజీ పర్వత శిఖరం.

పర్వత సానువులను ఆనుకొని వ్యాపించిన కవగూచి సరస్సులో చిన్నగా ఎగిసి పడుతున్నాయి తెల్లని కెరటాలు. కవగూచి పేరుకు సరస్సే అయినా అనంతమైన సాగరంలా ఉంటుంది. 240 మీటర్ల లోతులో కొన్ని కిలోమీటర్ల పర్యంతం వ్యాపించిన ఆ నిర్మల నీలాల హ్రదం ఆ ఉదయపు లే ఎండలో తళ, తళా మెరుస్తోంది.

సరస్సు ఒడ్డున వ్యాపించిన సంకీర్ణ కాననంలో మెల్లగా నడుస్తున్నారు వారు. తూరుపు తెల్లవారే సమయంలో ఆ బృందాన్ని కవగూచి సరస్సు ఒడ్డున దింపి వెనుతిరిగింది వారు ఎక్కివచ్చిన ట్రక్. మనుషులు నడవడానికి కూడా వీలు లేని చిట్టడవి అది.

ముందు వరుసలో ఇద్దరు పెద్ద వేటకత్తులను పట్టుకుని,

కొమ్మలను రెమ్మలనూ, అడ్డుగా వున్న ముళ్ళ పొదలనూ కొడుతూ దారి చేస్తున్నారు. వారి వెనుక హాలో చిమిన్, చిన్ లీ, తోషిబా మెల్లగా మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. వారిని అనుసరిస్తూ సామానులు వీపున వేసుకొని వస్తున్నారు మిగిలిన ఎనిమిదిమంది దృఢకాయులు.

ఫ్యూజీ పర్వతం గూర్చి తనకు తెలిసిన వివరాలను చెప్పటం ప్రారంభించాడు ప్రొఫెసర్ తోషిబా. వారు వింటూ నడుస్తున్నారు.

"ఈ పర్వతం పూర్తి పేరు ఫ్యూజియామా. 3776 మీటర్ల ఎత్తుగల ఈ పర్వతం నిజానికి ఒక స్లీపింగ్ వాల్కెనో. నిద్రిస్తున్న అగ్నిపర్వతం.

ఋతువులను బట్టి ఫ్యూజీ పర్వత వర్ణం, వాతావరణం అన్నీ మారిపోతుంటాయి శీతాకాలంలో దట్టంగా కురిసే మంచు పేరుకుపోయి వెండి కొండలా ధగ, ధగ మెరుస్తుంది ఆ పర్వత శిఖరం.

వేసవి వచ్చేసరికి వేడిగాడ్పులతో, భరించలేని సెగలు గ్రక్కుతూ జేగురు రంగులో కన్పిస్తుంది. శరదృతువులో పగలంతా వేడిగానూ, రాత్రులందు చల్లగానూ వుంటుంది అక్కడి వాతావరణం.

బహుశా కాలాన్ని బట్టి రూపాన్ని మార్చుకొనే పర్వతం ప్రపంచం మొత్తంమీద ఒక్క ఫ్యూజియామాయే నేమో!"

అంతలో అతడి మాటలకు అడ్డుకట్ట వేస్తూ వారి చెవులకు సోకింది ఒక ఆర్తనాదం. పది అడుగుల దూరంలో కన్పిస్తున్న ఆ దృశ్యాన్ని చూసి వారు భయంతో కంపించిపోయారు. ఇద్దరు పరుగెత్తుకొంటూ అటు వెళ్ళబోయారు. కాని తోషిబా చటుక్కున వారిని పట్టుకుని

ఆపుచేశాడు. ఎవరూ అక్కడికి వెళ్ళకద్దని శాసించాడతడు.

అలా నిశ్చేష్టులై వారా భయానక దృశ్యాన్ని చూడసాగారు.

కత్తులతో పొదలు నరుకుతూ దారిచేస్తున్న వారి ఇద్దరు సహచరులూ రెండు పొదలమధ్య చిక్కుకొని వున్నారు. పచ్చగా అరచేతులంత వెడల్పున వున్నాయి ఆ మొక్కల ఆకులు. సన్నగా, పొడుగ్గా తీగల్లా వున్న ఆ మొక్కల పత్రపుచ్ఛాలు వారిద్దరినీ నిలువెల్లా చుట్టి వున్నాయి. సన్నని పసిరిక పాముల్లా వారి మెడలను చుట్టుకుంటున్నాయి మరికొన్ని పత్రపుచ్ఛాలు.

అలా వారు చూస్తుండగానే వారి శరీరంలోని రక్తాన్నంతా పీల్చేశాయి ఆ పొదలు. భరించలేని మరణ వేదనతో వారు చేస్తున్న ఆక్రందనలతో ఆ అరణ్యం ప్రతిధ్వనించింది.

పాలిపోయిన ముఖంతో, పెదవులు కంపిస్తుంటే మెల్లిగా గొంతు పెగల్చాడు లోపెజ్.

"ఆవి మాంసాహార పొదలు హోచిమిన్. ఎంత బలమైన జంతువైనా, చివరికి పెద్ద పులికూడా వాటి బారినుండి తప్పించుకోలేదు. ఒక్కసారి తీగల్లా వున్న వాటి పత్రపుచ్ఛాలకు మన స్పర్శ తగిలిందంటే చాలు— కొన్ని సెకన్‌లలో మన శరీరం అంతటా అల్లుకుపోతాయి అవి.

ఇక అలాంటివారిని విడిపించడానికి ప్రయత్నించడం మన చావును మనమే కోరి తెచ్చుకోవడం వంటిది.

తమ సహచరుల్లో ఇద్దరు ఆ రాక్షస పొదలకు బలై పోవడం కళ్ళారా చూసిన వారి హృదయాలు బాధతో,

భయంతో బరువెక్కాయి. ఏం చేద్దామన్నట్లు వారు తమ నాయకుని వంక చూశారు.

ఇంకొక ఇద్దరిని దారిని చేస్తూ ముందుకు నడవమని ఆజ్ఞాపించాడు హోచిమిన్. వారు ఆ పొదలకు దూరంగా ఇంకో దిశలో తమ ప్రయాణం కొనసాగించారు. అలాంటి రాక్షస పొదలు మళ్ళీ ఎక్కడయినా తారసపడతాయేమోనని చాలా జాగ్రత్తగా చుట్టూ పరిశీలిస్తూ నడుస్తున్నారు వారు.

“అత్యంత ప్రాచీనమైన దుర్గమారణ్యం యిది. ఈ రాక్షస పొదలను చూస్తుంటే యింకా ఎలాంటి విచిత్ర జీవులను ఎదుర్కోవాలో అనిపిస్తూంది.”

సాలోచనగా అన్నాడు తోషిబా. అతడి వంక ప్రశ్నార్థకంగా చూశాడు హోచిమిన్.

“మీ సందేహం ఏమిటి తోషిబా?”

అతడి కళ్ళల్లోకే సూటిగా చూస్తూ అడిగాడు చిన్ లీ.

ఒక్కసారి చిన్నగా తల పంకించి చెప్పడం ప్రారంభించాడు తోషిబా.

“ఎప్పుడో ఆఫ్రికా అడవులలో వున్నాయని చదివాను ఆ రాక్షస పొదల గురించి. నైసర్గికంగా ఆఫ్రికా ఖండంలోని వాతావరణమే ఈ పొదలు యిక్కడకూడా వుండటానికి కారణం అయితే ఆ చీకటి ఖండంలో వున్నాయని వర్ణించబడ్డ ఎన్నో భయంకర జీవులుకూడా ఈ అరణ్యంలో వుండే వుండాలి. చాలా ప్రాచీనమైన అరణ్యం యిది.”

“మరి యింత దుర్గమారణ్యంలో ఆ పర్వతశిఖరం మీద ఆ బౌద్ధాలయం ఎలా నిర్మించారు?” సందేహంగా

అడిగాడు చిన్ లీ.

"అప్పటికి ఇది అరణ్యం కాదేమో!"

తోషిబా మాటలు అర్థంకాలేదు చిన్ లీకి. ఓ ప్రక్క ప్రాచీన అరణ్యముంటూను. బౌద్ధాలయం కట్టించే నాటికి ఆ అరణ్యం లేకపోయి వుండవచ్చు అంటున్నాడు. చిన్ లీ ముఖంలోని భావాలను చదివి చిన్నగా నవ్వాడు తోషిబా

"బుద్ధుని నిర్యాణానంతరం బౌద్ధమతం రెండుగా చీలిపోయింది. బుద్ధుని విగ్రహాన్ని పూజించేది హీనయాన మతం. త్రిరత్నాలను ఆదర్శంగా నిర్వాణదాతైన భగవానుని ప్రార్థించమని బోధించేది మహాయానమతం.

జపాను ప్రజలను ఆకర్షించినదీ, వారి చక్రవర్తుల ఆదరణను నోచుకున్నదీ హీనయాన మతమే. ఆ కాలంలో అంటే క్రీస్తు పూర్వం సుమారు మూడవ శతాబ్దిలో.... అంటే యిప్పటికి 2,200 సంవత్సరాల పూర్వం బహుశా ఈ బౌద్ధాలయం నిర్మింపబడింది.

కాలక్రమేణా యిక్కడి జనవాసాలు నశించి అరణ్యం చోటు చేసుకుంది."

వాంగ్ చిమిన్ తోషిబా వంక మెచ్చుకోలుగా చూశాడు. "యూ ఆర్ రియల్లీ ఇంటలిజెంట్" అంటూ ప్రశంసాపూర్వకంగా అతడి భుజం తట్టాడు.

అప్పటికి సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చాడు ఎండ తగలకుండా చెట్ల కొమ్మలు గొడుగులా నీడ పట్టుతున్నా, యేదో భరించలేని వేడిమి వారి శరీరాలను తాకుతోంది. అలసటగా ఆ చెట్లమధ్య కూర్చున్నారు వారు.

పాకెట్లు విప్పి ఎవరికి ఏం కావాలో అవి అందించసాగారు ఇద్దరు వ్యక్తులు. ఒక టిన్ బీరు తీసుకొని కాస్త

దూరంగా వున్న ఒక చెట్టు మొదలులో విశ్రాంతిగా కూర్చుని.... త్వరగా సిప్ చేస్తూ సాగాడు తోషిబా. చిన్న కాగితపు ప్లేటులో కాసిన్ని మటన్ టిక్కా-లు, రెండు, మూడు కేక్ పీసస్ పెట్టి అతడికి వినయంగా అందించాడు ఒక అనుచరుడు.

అంతా తమ లంచ్ తీసుకోవడంలో నిమగ్నమయి వున్నారు.

అంతలో వారికి ఏదెనిమిది అడుగుల దూరంలో వున్న పొద చిన్నగా కదలడం గమనించాడు వారిలో ఒకడు. మెల్లగా ఆ పొదవైపు నడిచాడు అతడు.

ఆ పొదలోనుండి ప్రాకుతుంటూ వస్తూంది ఐదడుగుల పొడవున్న పాము గోధుమ వర్ణంలో వున్న దాని శరీరంపై నల్లని పెద్ద, పెద్ద మచ్చలున్నాయి. ఆ పామువైపు ఆకలిగా చూశాడతడు. జపాన్ దేశస్థులకు పాము మాంసమంటే మహా ప్రీతి.

అతడు చప్పుడు చేయకుండా మెల్లగా వంగి తన బెల్టుకున్న చిన్న బాకును తీశాడు. ఆ పాము మరింత దగ్గరికి వచ్చింది. వారిద్దరి మధ్య దూరం యిప్పుడు ఐదడుగులకన్నా ఎక్కు-వ వుండదు. అతడు బాకును విసరడానికి తన చేయి పైకెత్తాడు. తన శత్రువును పసిగట్టినట్లు ఆ పాముకూడా చివాలున పడగవిప్పి తోకమీంచి లేచింది.

ఒక్క-సారి పూత్కా-రం చేసింది. అంతే!

పిచికారీతో యేదో మందు తన ముఖంమీద కొట్టినట్లయింది అతడికి. కనుగ్రుడ్లు పెకలివేసినంత బాధ. శ్వాసరంధ్రాలలో ఏదో ఘాటైన వాయువు ప్రవేశించినట్లు ... ఊపిరి ఆడక గిల, గిలలాడాడు. బాధతో కూడిన అరుపు

ఒకటి అతడి గొంతులోనుండి రాకముందే ఆ పాము జర, జరా వచ్చి అతడి కంఠంమీద కసిగా కాటువేసింది.

అంతే! కొన్ని సెకనలలో అతడి శరీరం నల్లగా మాడిపోయింది.

'దబ్' మని అతడి శరీరం నేలమీద పడిన శబ్దం విని పించేసరికి పరుగెత్తుకు వచ్చారు అతడి సహచరులు. వేగంగా పొదల్లోకి ప్రాకుతుంటూ పోతున్న ఆ నల్లని మచ్చల పామును, విగతజీవుడై పడి వున్న తమ సహచరుడ్ని చూసేసరికి వారికి జరిగిందేమిటో అర్థమయింది.

'స్ప్రేయింగ్ స్నేక్' అనుకున్నాడు తోషిబా ఆ పాము వంటిమీద నల్లని మచ్చలను చూసి.

భూమధ్యరేఖా ప్రాంతాల్లో వుండే అరుదైన పాము అది. తన శత్రువును పసిగట్టిన మరుక్షణం విషాన్ని స్ప్రే చేస్తుంది. ఆ విషప్రభావం వలన అవతల జీవి గ్రుడ్డిదవు తుంది. ఆ విషపు గాలికి ఉక్కిరి, బిక్కిరయి అచేత నంగా వున్న సమయంలో తన శత్రువును కాటేసి చంపు తుంది ఆ స్ప్రేయింగ్ స్నేక్.

తమ సహచరుడి శవం చూడటంతోనే వారికి కడు పులో దేవినట్లయింది. జీవితంలో మొదటిసారిగా వారి మనసులలో యేదో తెలియని భయం ప్రవేశించింది.

6

చీకటి పడేంతవరకూ ఎక్కడా ఆగకుండా వారు ప్రయాణం సాగించారు. ఎవ్వరూ క్రింద వుండకూడదనీ, అందరూ చెట్లమీదకు ఎక్కి ఆ రాత్రికి విశ్రాంతి తీసు కొమ్మని చెప్పాడు తోషిబా.

అందరూ తలా కాస్త కాల్చిన ఎండు మాంసం, ఇంత శ్రద్ధా తిని చెట్లమీదకు ఎగబ్రాకారు. నిద్ర

మత్తులో క్రిందకు జారిపడకుండా పొడుగాటి గుడ్డలతో తమ శరీరాలను కొమ్మలకు గట్టిగా బిగించి కట్టుకొని ఆ తరువాత నిద్రకు ఉపక్రమించారు వారు. శారీరకంగా, మానసికంగా బాగా అలసిపోయి వున్నారేమో వారిని నిద్రాదేవత తొందరగానే కరుణించింది.

చీకటి అడవిని ఆవహించిన వేళ, శుక్లపక్ష చంద్రుని గుడ్డి వెలుగు ఆకుల సందులగుండా ప్రసరిస్తూంటే, తెలుపు, నలుపు దారాలు కలనేసి నేసిన తివాచీలా వుంది నేల. వేటకు బయలుదేరిన క్రూరమృగాలూ, ప్రాణభీతితో పరుగులు తీసే మూగజీవులూ....

అడవి అంతా అప్పుడే నిద్ర లేచిందా అన్నట్లు అత్యంత కోలాహలంగా వుంది.

అడవి దద్దరిల్లి పోయేటట్లు వినిపించిన గర్జనలకు వారు ఉలిక్కిపడి లేచారు. ఆ దృశ్యాన్ని చూసేసరికి వారి అరచేతులకు చమటలు పట్టాయి. భయంతో వారి శరీరాలు కంపించసాగాయి. తమ శరీరాలు ఆ కొమ్మలకు కట్టబడి ఉండకపోతే వారు పట్టు జారి క్రిందపడి వుండేవారేమో!

నల్లగా మదించిన గున్న ఏనుగులా వుంది ఆ అడవి దున్న. గిట్టలతో మట్టిని పెళ్ళగిస్తూ....తన వాడి కొమ్ములను విసురుతూ హుంకరిస్తుంది. పాము బుసలా వుంది దాని నిశ్వాసం. దాని చుట్టూ ఆరడుగుల దూరంలో ఒక వలయంలా నిలబడి వున్నాయి యేడెనిమిది సింహాలు.

వెనుక కాళ్ళను చాచి, ముందు కాళ్ళను వంచి యే క్షణంలోనైనా దానిమీదకు దుముకడానికి సిద్ధంగా వున్నాయి. పొడుగాటి తమ జూలును విదలిస్తూ, మోర లెత్తి భయంకరంగా గర్జిస్తున్నాయవి.

సింహం అడవికి రాజని, ఒంటరిగా వేటాడుతుందని కథలుగా చెబుతారు. కాని వాస్తవానికి ఒంటరిగా వేటాడేది పెద్దపులి. సింహాలు యెప్పుడూ గుంపుగా వేటాడతాయి.

వారు కళ్ళు విప్పార్చుకుని ఆ సింహాల వంక చూడసాగారు.

ఇంతలో ఛటాలున ఒక సింహం ఎగిరి అడవిదున్న మీద పడింది. కాని అడవిదున్న తెలివిగా ప్రక్కకు తప్పుకోవడంతో దబ్బుమని నేలమీద పడిందది. నేల మీద పడిన సింహాన్ని తన కాలి గిట్టలతో గట్టిగా త్రొక్కింది ఆ దున్న. అది లేచేలోగా తన వాడి కొమ్ములను దాని పొట్టలో గ్రుచ్చింది. రక్తంతో తడిసిన దాని కొమ్ములు ఎర్రని మోదుగుపూల కొమ్మల్లా వున్నాయి.

అయితే అదే సమయంలో మరో రెండు సింహాలు ఆ దున్నపై దాడిచేశాయి. ఒకటి దాని మూపుపై దూకి ఆ దున్న మెడపై తనవాడి కోరలను దించింది. యింకొకటి దాని పొట్టను తన పంజాతో చీల్చసాగింది. బాధగా హుంకారావం చేస్తూ వాటిని విదల్చింది ఆ అడవిదున్న. ఆ విసురుకు అల్లంత దూరంలో పడ్డాయి ఆ సింహాలు.

క్రిందపడ్డ ఒక సింహాన్ని తన తలతో గట్టిగా మోదింది. ఆ దెబ్బకు ప్రక్కటెముకలు ఫెళ్, ఫెళ్మని విరిగి, చారెడు రక్తం క్రక్కింది ఆ సింహం. ఇంతలో ఒకేసారి మూడు సింహాలు ఆ దున్నమీదకు లంఘించి.... తమ వాడి పంజాలతో దాని శరీరాన్ని చీల్చసాగాయి.

రక్తసిక్తమయిన దేహంతో, కండలు ఊడిపోతుంటే ప్రాణభీతితో పరుగులంకించుకుంది ఆ అడవిదున్న. కాని అది కొన్ని గజాలు పోకముందే దాన్ని మరోమా

ఎటాక్ చేశాయి ఆ సింహాలు. అంతే! తన కంఠనాళాలను కొరుకుతున్న ఒక సింహం వంక నిస్సహాయంగా చూస్తూ నేలకు వాలిపోయింది ఆ అడవిదున్న.

కండలు, కండలుగా దాని మాంసాన్ని పీక్కు తింటున్న సింహాలను చూసేసరికి వారి ముఖాలు తెల్లగా పాలిపోయాయి. 'తాము ఆ రాత్రి చెట్టుక్రిందే వుండి నట్లయితే ఆ అడవిదున్న స్థానంలో తాముండేవారు' అనుకున్నారు వారు గొంతుకల్లో తడి ఆరిపోతూ వుంటే.

ఆ భయానక దృశ్యాన్ని చూశాక మరా రాత్రి వారు నిద్రపోలేదు.

7

అడవి పల్చబడింది.

కూతవేటు దూరంలో ఫ్యూజీ పర్వత పాదం కనిప్తూంది.

చిన్న, చిన్న, దుబ్బలూ, పొదలూ తప్ప పెద్ద వృక్షాలేమీ లేవు. మృత్యులోయలాంటి అరణ్యాన్ని దాటి నందుకు వారు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

"ఇంకో నాలుగు గంటలు నడిచాక మన అసలు గమ్యం ప్రారంభమవుతుంది హోచిమిన్" — ఫ్యూజీ పర్వతం వంక చూస్తూ అన్నాడు తోషిబా.

వెచ్చని సూర్యకిరణాలు వంటికి తగులుతుంటే వారికి ఎంతో హాయిగా వుంది. పచ్చని పాదపాలను దాటు కుంటూ వారు విశాలమైన పచ్చిక మైదానంలో అడుగు పెట్టారు. పచ్చగా, వత్తుగా పెరిగిన పచ్చికలో అక్క-డక్కడ మొలిచిన ఊదారంగు గడ్డిపూలు తృణాంబరాన మొలిచిన తారకల్లా వున్నాయి.

వారు నడుస్తున్న దారిలో, వారికి కొన్ని గజాల

దూరంలో కన్పించిన ఒక మనోజ్ఞమైన దృశ్యం వారిని ఆనందపరవశులను చేసింది. ఆ పచ్చిక బయలు మధ్య కొన్ని గజాల మేర అంతా ఎర్రగా వుంది. కుంకుమ పూలు వత్తుగా జల్లినట్లు ఎర్రని తివాచీ ఏదో పరచినట్లు సింధూర వర్ణంలో మిల, మిలా మెరుస్తూంది అది. ఏవో గడ్డిపూలు అనుకున్నారు వారు.

"బ్యూటిఫుల్ .... ఫెంటాస్టిక్ ...." అంటూ ముగ్గురు ఆ పూల తివాచి వంక పరుగెత్తుకుంటూ వెళ్ళారు.

అప్పుడే తివాచీల వున్న ఆ ఎర్రని భాగం మెల్లగా కదలడం గమనించాడు తోషిబా. పరుగెత్తుతున్న వారిని ఆగమని గట్టిగా అరిచాడు అతడు. కాని, వారు అప్పటికే ఆ ఎర్రని పూలమధ్యకు చేరుకున్నారు.

దోసిళ్ళతో ఆ ఎర్రని పూలను కోద్దామని వంగారు వారు. కాని అవి పూలు కాదని ఎర్రచీమలని గ్రహించేసరికి వెర్రిగా కేకలు పెట్టారు. అప్పటికే వారి శరీరం నిండా క్రమ్ముకున్నాయి ఆ ఎర్రచీమలు. పిచ్చిపట్టిన వారిలా పరుగులుతీశారు వారు.

కాని, కొన్ని గజాలమేర వ్యాపించి వున్న ఆ చీమల వ్యూహంనుండి తప్పించుకోవటం వారికి సాధ్యపడలేదు. వారి కనుగుడ్లను, పెదవులను ఆ చీమలు కొరికి తినేశాయి. భరించలేని బాధతో వారు చేస్తున్న ఆక్రందనలు ప్యూజీ పర్వత సానువుల్లో ప్రతిధ్వనించాయి.

ఆ చీమలబారును చూసేసరికి తోషిబా వెన్నులో చలిపుట్టుక వచ్చింది.

ఆఫ్రికా ఖండంలో కూడా చాలా అరుదుగా కనిపించే "కానిబల్ యాంట్స్" అవి. సుమారు రెండంగుళాల పొడవు వుండే ఆ చీమలు ఎప్పుడూ గుంపుగానే

సంచరిస్తాయి. ఎర్రని తివాచీలా కన్పించే వాటివైపు ఆకర్షింపబడి యేదైనా జంతువు వస్తే.... దాన్ని చుట్టుముట్టి కొన్ని క్షణాలలో దానిని పూర్తిగా తినేస్తాయి. ఒక్కసారి వాటి పాలబడితే ఏనుగులాంటి అతి పెద్ద జంతువుకూడా తప్పించుకోలేదు.

కొన్ని నిముషాలలో ఎముకల ప్రోగులుగా మారిన తమ సహచరులను చూసేసరికి భయంతో వారి ప్రాణాలు కడగట్టిపోయాయి.

"ఈ ఎసైన్ మెంట్ ను ఒప్పుకుని తాను తప్పుచేశానా" అని మొదటిసారిగా బాధపడ్డాడు హోచిమిన్.

"కమాన్ .... రన్ ఎవ్విబడీ"

ఆ కానిబల్ యాంట్స్ కళ్ళబడకముందే అక్కడి నుండి దూరంగా పారిపోవాలి అనుకుంటూ తోషిబా.... ఆ చీమల బారుకు దూరంగా వేరే దిక్కులో పరుగెత్తడం ప్రారంభించాడు. భయంతో వణికిపోతూ మిగిలినవారు కూడా అతడిని అనుసరించారు.

సుమారు రెండు ఫర్లాంగుల దూరం ఆగకుండా పరుగెత్తారు వారు. ఆయాసంతో వారి గుండెలు ఎగిసి, ఎగిసి పడుతున్నాయి. ఒళ్ళంతా చెమటలుపట్టి ధారలుగా కారసాగింది.

అడవి దిశగా నెమ్మదిగా సాగిపోతున్న ఆ ఎర్ర చీమల సమూహాన్ని చూసి వారి గుండెలు తేలికపడ్డాయి. కాసేపు అలసట తీర్చుకొని తిరిగి తమ ప్రయాణాన్ని కొనసాగించారు.

సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చే సమయానికి వారు ఫ్యూజీ పర్వతం దగ్గరకు చేరుకున్నారు. నున్నగా, కాలు వేస్తే జారిపోయేలా వుంది ఆ సమున్నతమైన పర్వతం.

అగ్నిపర్వతాల ఆకారాలే విచిత్రంగా వుంటాయి. చిన్న, చిన్న బండలుగా గాక అంతా ఒకే పెద్ద శిలలా, నున్నగా, గుండ్రంగా పోతపోసిన శివలింగంలా వుంటుంది. వేడి సెగలూ పొగలూ గ్రక్కుతూ మండుతున్న అగ్నిగోళంలా వుంటుంది. అయితే కొన్ని డెడ్ వాల్కానోస్ లేక స్లీపింగ్ వాల్కానోస్....అంటే సెగలూ పొగలూ లేని అగ్నిపర్వతాలూ వుంటాయి. వాటిని నిద్రిస్తున్న అగ్నిపర్వతాలు అంటారు.

ఫ్యూజీకూడా అలాంటి నిద్రిస్తున్న అగ్నిపర్వతమే.

వారంతా లఘువుగా కాస్త ఆహారాన్ని తీసుకొని ఆ పర్వతాన్ని అధిరోహించడం ప్రారంభించారు. ముందుగా ఒకడు మెల్లగా పైకి ఎగ్రబాకి.... అక్కడక్కడ శిలా ఫలకాలలో ఏర్పడిన చీలికలలో పెద్ద ఇనుప మేకులను దిగగొట్టి దానికి బలమైన త్రాడును చుట్టి క్రిందకు జారవిడుస్తున్నాడు. ఆ త్రాడు సాయంతో మిగిలినవారు మెల్లగా పైకి ఎగ్రబాకసాగారు.

కొంతదూరం నిట్టనిలువుగా, ఆ తరువాత సమతలంగా మళ్ళీ ఏటవాలుగా....ఇలా విభిన్నమైన రీతులలో వున్న ఆ పర్వతాన్ని అధిరోహించడమంటే మాటలతో పని కాదు. త్రాడు పట్టుకొని ఎక్కటంలో వారి అరచేతులు ఎర్రగా కందిపోయి మంటలు పెడుతున్నాయి. రాళ్ళకు తగలడంతో వారి మోచేతులు, మోకాళ్ళు పూర్తిగా కొట్టుకుపోయాయి.

3,776 మీటర్లు అంటే సుమారు 12,889 అడుగుల ఎత్తున్న ఆ ఫ్యూజీ పర్వతాన్ని అధిరోహించడమంటే నిజంగా గొప్ప సాహసకృత్యమే.

మసక చీకట్లు ముసిరే సమయానికి ఒక సమతల ప్రదేశాన్ని చేరుకున్నారు వారు. కొండవాలులో ఏర్పడ్డ చీలికలో మొలిచి వుంది ఏదో పెద్ద వృక్షం. ఆ చెట్టు క్రింద ఆ రాత్రికి మజిలీ వేద్దామనుకున్నారు వారు.

సన్నగా కురుస్తున్న మంచుతో పాటు గుండెలను వణికించేటంత చలికూడా ప్రారంభమయింది. అది వేసవి కాబట్టి వారు ఎలాగో ఆ చలిని తట్టుకోగలిగారు. అదే శీతాకాలం అయితే....అక్కడి చలికి వారు గడ్డకట్టుకుపోవాల్సిందే. నవంబరు, డిసెంబరు మాసాలలో మౌంట్ ఫ్యూజీ శిఖరం మీద ఉష్ణోగ్రత —38 డిగ్రీల సెంటీగ్రేడ్‌లు వుంటుంది.

బాగ్స్ తెరిచి విస్కీ బాటిల్స్ పైకితీశారు. రా విస్కీ గొంతులో ఒంగేసరికి... ఒక్కసారిగా గొంతు మండింది. విస్కీ మత్తు మెల్లగా నరాలకు ఎక్కేసరికి గుండెల్లోకి వెచ్చదనం వచ్చింది. వంటినిండా ఉన్ని కంబళ్ళు కప్పుకొని ముడుచుకుంటూ కూర్చున్నారు వారు. నిద్ర లేమితో కళ్ళు మూసుకుపోతుంటే ఆ రాతి నేలమీద అలానే వ్రాలిపోయారు వారు.

8

నిశి రాత్రి తెలవారగా బిగికౌగిట సొక్కి సోలిన అరుణ భానుడు బద్ధకంగా లేచాడు. నింగీ నేలా కలిసేచోట కడలి అంచులమీద కెంజాయి సోనలు విచ్చుకుంటున్నాయి. ఫ్యూజీ పర్వత శిఖరాన్ని చుట్టుముట్టి వున్న మేఘాలు పర్వతరాజు ధరించిన పూల కిరీటంలా ఉన్నాయి.

వారు మెల్లగా తమ ప్రయాణం కొనసాగించారు.

మంచు కురియడం చేత అసలే నున్నగా ఉన్న శిలా

తలం మరింత జారుతూంది. ఇనుప మేకులకు బిగించిన మ్రోకుల సాయంతో మెల్లిగా యెగబ్రాకుతున్నారు వారు.

ఆదే సమయంలో చెవులు చిల్లులుపడేలా వినిపించిన శబ్దానికి ఉలిక్కిపడి వారు చుట్టూ చూశారు.

ఫ్యూజీ పర్వతాన్ని దాటుకొంటూ వస్తూంది ఒక సీ హాంటర్ విమానం. జపాన్ ప్రభుత్వపు డిఫెన్స్ ఎంబ్లమ్ దానిపై కొట్టవచ్చినట్లు కన్పిస్తూంది. ఆ సీ హాంటర్‌ను చూసిన మరుక్షణం వారు బల్లుల్లా ఆ రాతి బండలకు కరుచుకుపోయారు. వారు ధరించిన మట్టి రంగు దుస్తులు ఫ్యూజీ పర్వత వర్ణంలో కలిసిపోయాయి.

ఆ విమానం తమ దృష్టిపథాన్నుంచి దాటాక మెల్లగా తలలెత్తారు వారు. కనుమరుగవుతున్న ఆ సీ హాంటర్ వంక సాలోచనగా చూస్తూ అన్నాడు చిన్‌లీ.

"మనం యింత రిస్క్ తీసుకొని యిలా పర్వతాన్ని ఎక్కేబదులు హాయిగా ఒక హెలీకాప్టర్‌లో వచ్చేయవలసింది బాస్.'

చిన్‌లీ వంక చిరునవ్వు నవ్వుతూ చూశాడు హోచిమిన్. ఆమాత్రం ఆలోచన నాకు తట్టలేదంటావా పిచ్చివాడా అన్నట్లుగా ఉంది ఆ చూపు.

"ఫ్యూజీ పర్వతానికి పశ్చిమానున్న పర్వత శిఖరాల మీద యేముందో చిన్‌లీకి కాస్త అర్థమయ్యేట్లు చెప్పు తోపిఖా" అన్నాడు హోచిమిన్.

"జపాన్ కోస్టల్ గార్డ్స్‌కోసం ఆ పర్వత శిఖరాలపై ప్రత్యేకంగా నిర్మింపబడింది ఒక రక్షణ ప్రాకారం. సీ హాంటర్స్‌లాంటి అత్యంత ఆధునిక విమానాలతోపాటు యుద్ధ సమయంలో శత్రు విమానాలను కూల్చేందుకు

అనువుగా విమాన విధ్వంసక శత్రుఘ్నులు సైతం ఆ పర్వత శిఖరంమీద అమర్చబడ్డాయి.

హై పవర్ టెలిస్కోప్‌లతో గగన భూ తలాలను ఎల్ల వేళలా పర్యవేక్షిస్తుంటారు ఆ ప్రాకారంలోని గార్డ్స్. తమ సంకేతం చెప్పకుండా, యితర విమానాలు గాని, హెలికాప్టర్లు గాని ఆ ప్రాకారానికి నూరు కిలోమీటర్ల పరిధిలో గగన తలాన్ని అతిక్రమించిన మరుక్షణం.... రాడార్స్ వాటి ఉనికిని రికార్డు చేస్తాయి. ఏ కమ్యూనికేషన్ లేకుండా....కనీసం వార్నింగ్ కూడా యివ్వకుండా వాటిని ఆకాశంలోనే స్మాష్ చేసేస్తారు వారు.” చెప్పాడు తోషిబా.

తోషిబా చెప్పినదంతా వినేసరికి....వారికి ముచ్చెమటలు పట్టాయి. విధి వక్రించి ఆ సీ హంటర్ కళ్లల్లో తాము పడి ఉంటే జరిగేదేమిటో ఊహించుకొనేసరికి వారికి భయంతో ఒళ్ళు జలదరించింది.

అంత సీక్రెట్ ప్రాకారం గురించి కూడా తెలుసుకో గలిగాడు కాబట్టే హోచిమిన్ ‘యకుజా’ గాంగ్ లీడర్ కాగలిగాడు—అనుకున్నాడు చిన్ లీ.

మేకులకు చుట్టడ్డ త్రాడును పట్టుకొని మెల్లగా పైకి ఎగ్రబాకుతున్న వారు ఒక్కసారిగా పెనుగాలికి ఊగే చివురు కొమ్మలా ఊగిపోయారు. ఆ మ్రోకును గట్టిగా పట్టుకొని వుండకపోతే వారు పట్టు తప్పి జారిపోయి వుండేవారే.

అయితే అందరికంటే ముందుగా పర్వతాన్ని ఎక్కుతూ బండల చీలికల్లో ఇనుప మేకులను దిగగొట్టుతున్న అనుచరుడు మాత్రం ఆ అదటుకు తుళ్ళిపోయాడు. ఏదో రాక్షస హస్తం పట్టుకొని విసిరేసినట్లు ఆ పర్వత శిఖరం

నుంచి దొర్లుతుంటూ నేలమీదకు జారిపోయాడు. మరణ భీతితో అతడు వేసిన చావుకేక వారిని నిశ్చేష్టులను చేసింది.

ఆ అదురుకు కారణం యేమిటా అని వారు ఆశ్చర్య పోతున్న సమయంలో వారు పట్టుకున్న క్రోమతో సహా ఎవరో బలంగా ఊపినట్లు గాలిలో మరో కొక్క సారి తేలుగా ఊగారు. ఆ ఊపుకు వేగంగా వచ్చి ఆ బండ లకు తాకటంతో ఇద్దరి నుదురులు చిట్లి ముఖాలు రక్త సిక్తాలయ్యాయి.

అప్పుడు గమనించారు వారు ఆ అదురుకు కారణం. ఆ రెండుసార్లూ కంపించింది ఫ్యూజీ పర్వతం. అదీ కేవలం ఒకటి రెండు సెకన్లు. అంతే!

కంపించినది ఫ్యూజీ పర్వతమని గ్రహించిన మరుక్షణం ప్రొఫెసర్ తోషిబా నోసలు ముడిపడింది. అతని ముఖంలో 'ఇదెలా సంభవమైంది' అన్న ఆశ్చర్యం కొట్ట వచ్చినట్లు కన్పిస్తూంది.

అగ్నిపర్వతాలు కంపించడం ప్రకృతి సహజం. కాని ఫ్యూజీలాంటి స్లీపింగ్ వాల్కెనోస్ కంపించడమంటే చిత్రమే మరి.

అగ్నిపర్వతంలో అడుగున భూగర్భంలోని రాతి పలుకలు కరిగి ద్రవం అవుతాయి. దాని పేరు మాగ్మా. సుమారు 1800 నుండి 1500 సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రత వద్ద ఈ రాతి పలుకలు కరిగి ద్రవంగా మారుతాయి.

ఈ మాగ్మా దారిలో రాళ్ళనీ రాళ్ళలో వుండే లోహాలనూ కరిగించుకుంటూ పర్వత శిఖరాన్ని చీల్చుకొని పైకి ఎగిసేసరికి దీని వేడి తగ్గుతుంది. అప్పుడు ఆ మాగ్మానే 'లావా' అని పిలువబడుతూంది.

ఎగిసివచ్చే మాగ్మా ఉధృతానికి అప్పుడప్పుడు అగ్ని పర్వతాలు కంపిస్తూ వుంటాయి. అలా యేర్పడిన ప్రకంపనాలు నేలలో కొన్ని మైళ్ళదూరం వ్యాపించి ఒక్కొక్కసారి పెద్ద, పెద్ద పట్టణాలనే భూమట్టం చేసేస్తూ ఉంటాయి.

"అయితే ఫ్యూజీ యాక్టింగ్ వాల్కెనోయా....?" అన్న సందేహం తోషిబా మనసును పట్టి పీడించసాగింది. అతడు తన అనుమానాన్ని మనసులోనే దాచుకున్నాడు.

తమ తోటి సహచరులు ఒక్కొక్కరుగా ఈ ఎసైన్‌మెంట్ కు బలైపోతుంటే ఒక ప్రక్క బాధ గుండెను పిండేస్తున్నా.... మొండిగా తమ ప్రయాణం కొనసాగిస్తున్నారంటే అది యకుజా గాంగ్ సభ్యులలాంటి రాతి గుండెల మనుషులకే చెల్లుతుంది.

మ్లానమైన ముఖాలతో వారు ఆ పర్వతాన్ని అధిరోహించసాగారు.

9

సంధ్య చీకట్లు ముసురుకొనే సమయంలో వారు ఆ పర్వతాన్ని చేరుకున్నారు.

విశాలంగా సమతల మైదానంలా వున్న ఆ పర్వత శిఖరంపైన .... ఆ శిధిల బౌద్ధారామాన్ని చూసేసరికి వారిలో నూతనోత్సాహం పొంగిపొరలింది. ఇంతవరకూ అనుభవించిన క్లేశాన్నంతా వారు ఆ క్షణంలో మరిచిపోయారు.

కొండలనూ, కోనలనూ ముంచెత్తుతూ చీకటి చిక్కబడసాగింది. నింగిలో మిణుకు, మిణుకుమంటూ మెరుస్తున్న చుక్కల గ్రుడ్డి వెలుగులో ఆ శిధిలారామం భూతాల గృహంలా వుంది.

సమున్నతమైన ఆ పర్వత శిఖరంమీద నిలుచుంటే ఆ నిర్మల [illegible] భూ[illegible] పీడి [illegible] గ్రహంమీద కాలు మోపామా అనిపించసాగింది వారికి.

వారు మెల్లగా నడుచుకుంటూ ఆ శిథిలారామంలో ప్రవేశించారు. శక్తివంతమైన టార్చిలైట్ల వెలుగులో వారు ఆ శిథిల శేషాలన్ని పరీక్షగా చూడసాగారు.

ముందుగా ప్రాకారకుడ్యం దాటి లోపలకు అడుగు పెట్టారు వారు. విరిగి నేలమీద పడివున్న రాతి స్తంభాలపై చెక్కి వున్న బుద్ధుని జాతక కథా శిల్పాలు టార్చిలైటు వెలుగులో స్పష్టంగా కనిపిస్తున్నాయి. వారికి మరింతగా సహకరించడానికా అన్నట్లు వెన్నెలలు విరజిమ్ముతూ చంద్రుడు పైకి వచ్చాడు.

ఆరామ ప్రధాన ద్వారంపై శిలా తోరణం చెక్కి వుంది. బోలుగా వున్న ఆరామకుడ్యం నుండి చంద్ర కాంతి సన్నని కిరణంలా లోపలికి ప్రసరిస్తూంది. ఆరామమంతా కటిక చీకటిగా వున్నా ఆ సన్నని వెలుగులో బుద్ధ విగ్రహం పాదాలు మాత్రం తళ, తళ మెరుస్తున్నాయి.

లోకానికి జ్ఞాన జ్యోతి నందించిన ఆ తథాగతుని పాదాలను శశికాంతుడు తన వెన్నెల కిరణాలతో అభిషేకిస్తున్నాడా అన్నట్లు సరిగ్గా ఆ చంద్రకాంతి ఆ పాదాలమీదే పడుతూంది.

ఎక్కడో కోణార్క దేవాలయంలో సూర్యకాంతి సరిగ్గా సూర్య విగ్రహంమీద పడుతూందని యెప్పుడో చదివాడు లోకేష్. నిజానికి పూర్వీకులే నిజమైన వాస్తు కళా నిపుణులా అన్న సందేహం కలుగుతూంది యిలాంటి అపురూపమైన దృశ్యాలను చూసేటప్పుడు.

వారు టార్చిలైట్ల వెలుగును లోపలకు ఫోకస్ చేస్తూ ఆరామంలో అడుగు పెట్టారు. ఒక్కసారిగా వెలుగుతో ఆ పద్య అంతర్భాగం ప్రకాశవంతమైంది.

అయితే మరుక్షణం వారి కర్ణపుటాలు బ్రద్దలయ్యేలా 'కీచు'మని వికృతంగా అరుచుకుంటూ ఒక్కసారిగా గాలిలోకి లేచాయి కొన్ని నల్లని ఆకారాలు. ఒక్కొక్కటి సుమారు రెండడుగుల పొడవు మూడేసి అడుగుల పొడవుగల రెక్కలున్న రాక్షసి గబ్బిలాలవి. రెక్కలు పూర్తిగా విప్పసరికి అరడుగుల పైబడి వున్నాయవి.

తమ చీకటి సామ్రాజ్యంలోకి యేవో వింత ప్రాణులు వచ్చి తమ మీద వెలుగులు ప్రసరించడం సహించలేకపోయాయి అవి. గాలిలో ఒక్కసారి చక్కర్లు కొట్టి రివ్వుమంటూ వచ్చి వారి ముఖాలపై దాడి చేశాయి అవి.

వాటి ఆకారాలను చూసిన మరుక్షణం ముందుగా రియాక్ట్ అయింది లోపిబా.

“కమ్ అవుట్....కమ్ అవుట్ ఎవ్రీబడీ”

అంటూ అరచేతులతో ముఖాన్ని దాచుకుని, వెర్రిగా కేకలు వేస్తూ ఆరామం బయటకు పరుగెత్తాడతడు.

తమ బుగ్గలపై, ఫాలంపై వాడి గోళ్ళతో అవి రక్కుతుంటే బాధగా అరుస్తూ మిగిలినవారూ బయటికి పరుగెత్తారు. అయితే చివరగా వస్తున్న అనుచరుడి రెండు కళ్ళను రెండు రాక్షస గబ్బిలాలు ఒకేసారి పొడిచేయడంతో ఆర్తనాదం చేస్తూ అతడు అక్కడే కూలబడి పోయాడు.

క్రిందపడిన అతడి శరీరంమీదకు వ్రాలి అతని శరీరం

లోని కండలను తమ వాడి గోళ్ళతో పీకసాగాయి ఆ రాక్షస గబ్బిలాలు.

తమకు కావల్సిన రహస్యాలు సేకరించడానికి, తాము అనుకున్నది సాధించడానికి ఎంతోమంది అమాయకులను చిత్రవధ చేసి చంపి వుంటాడు ఆ యాకుజా గాంగ్ సభ్యుడు. కాని నిజమైన చిత్రవధ అంటే యేమిటో అతడికి అప్పుడే తెలిసింది.

శరీరంలోని ఒక్కొక్క భాగాన్ని కరకు కత్తులతో కోస్తున్నట్లుగా వుంది అతని స్థితి. డెస్పరేట్ గా చేతులూ కాళ్ళూ విదిలిస్తున్నాడతను. గొంతు చించుకుంటూ అతడు చేస్తున్న ఆర్తనాదాలు వాటి వికృతమైన అరుపుల్లో కలిసిపోయాయి.

అతడి పొట్టను చీల్చి పేగులు పైకి లాగాయి. అంతే! గిజ, గిజ గింజుకుంటున్న అతడి శరీరం చలనరహితమై పోయింది.

ఆరామానికి బయట ఇరవై గజాల దూరంలో నిలుచుని తమ సహచరుడి చావుకేకలు వింటున్నారు వారు. భయంతో వారి దేహాలు వణికిపోతున్నాయి.

"ఆ రాక్షస గబ్బిలాలు ఒకవేళ పైకి వచ్చి తమను ఎటాక్ చేస్తే....!"

ఆ ఆలోచన రాగానే వారి ముఖాలు తెల్లగా పాలిపోయాయి. కాని, 'ఆ గబ్బిలాలు తమ కెలవులు దాటి పైకి రావని' తోషిబా చెప్పేసరికి వారి గుండెలు కుదుటపడ్డాయి.

సూర్యోదయంకోసం ఎదురుచూస్తూ.... కూర్చున్నారు వారు. వారు ఖాళీ చేసిన విస్కీ బాటిల్స్ వెన్నెలలో తళ, తళా మెరుస్తున్నాయి. నిలువెల్లా ఉన్ని కంబళ్లు

కప్పుకొని కూర్చున్న వారు చీకట్లో ఫ్యూజీ పర్వతం మీద వ్రాలిన పిశాచాల్లా వున్నారు.

10

సూర్యకిరణాలు వెచ్చగా తగులుతుంటే బద్ధకంగా కళ్ళు విప్పుకుంటూ లేచారు వారు. ప్లాస్టిక్ కాన్‌లలోని నీటితో ముఖాలు కడుక్కున్నాక తమ వద్ద మిగిలిన ఆహారాన్ని తలా కాస్తా పంచుకొని తిన్నారు.

చావగా మిగిలిన యిద్దరు అనుచరుల వంక నిర్వికారంగా చూశాడు హోచిమిన్. తను చిన్ లీ, తోషిబా కాక పదిమంది అనుచరులతో ఈ ఎసైన్‌మెంట్ ప్రారంభించాడు.

మాంసాహార పొదలు యిద్దరినీ, స్ప్రేయింగ్ స్నేక్ ఒకడినీ, కానిబుల్ యాంట్స్ ముగ్గురినీ, కంపించిన ఫ్యూజీ పర్వతం మరొకడినీ ఇలా పర్వతాన్ని పూర్తిగా అధిరోహించేసరికి ఏడుగురు అనుచరులను బలి తీసుకుంది ఈ ఎసైన్‌మెంట్.

తీరా శిఖరం పైకి చేరాక రాత్రి శిథిలారామంలో రాక్షస గబ్బిలాల వాత పడ్డాడు ఎనిమిదోవాడు. ఇక మిగిలింది కేవలం యిద్దరు అనుచరులు.

ఒక్కొక్క అనుచరుడూ మృత్యువువాత పడుతుంటే వారితో పాటే వారు మోసుకువస్తున్న ఆహారపదార్థాలు, నీరు అన్నీ కోల్పోయారు తాము. ఈ రోజు ఉదయంతో తమ దగ్గర మిగిలిన కాస్త ఆహారం అయిపోయినట్లే. మరి తిరుగు ప్రయాణం ఎలా....?

ఇది కాదు హోచిమిన్‌ను వేధిస్తున్న అసలు సమస్య.

"హౌ టు ఎంటర్ ఇన్‌టూ దట్ ఏన్షియంట్ టెంపుల్....?"

ఆ శిథిలారామాన్ని చూస్తూ అదే తీవ్రంగా ఆలోచిస్తున్నాడు హోచిమిన్.

హోచిమిన్ మనసులోని ఆలోచనలను పసిగట్టాడు తోషిబా.

"ఆ గబ్బిలాలకు పగలు కళ్ళు కనిపించవు హోచిమిన్. మనం ఆరామంలో ప్రవేశించకుండా ద్వారం దగ్గర కాపువేసి వాటిని కాల్చి చంపాల్సి వుంటుంది."

నెమ్మదిగా చెబుతున్న తోషిబా వంక మెరుస్తున్న కళ్ళతో చూశాడు హోచిమిన్. మరుక్షణం చివ్వున లేచి ఆరామంవైపు నడవసాగాడు. మిగిలిన నలుగురూ అతడిని అనుసరించారు.

నడుముకున్న బెల్టుకు వ్రేలాడుతున్న హోల్‌స్టర్‌ల నుండి రివాల్వర్స్ తీసి చేతులలో సిద్ధంగా వుంచుకున్నారు హోచిమిన్, తోషిబా, చిన్‌లీ. తళ, తళ మెరుస్తున్న స్టీల్ పేష్కబ్జ్‌లను రెండు చేతులతో పట్టుకొని, నడుస్తున్నారు మిగిలిన యిద్దరు అనుచరులు.

ప్రాకారకుడ్యం దాటి ఆరామ ప్రధాన ద్వారంవద్ద మోకాళ్ళపై కూర్చున్నాడు హోచిమిన్. అతడికి యిరుప్రక్కలా అతనిలాగే ఆరామానికి అభిముఖంగా మోకాళ్ళపై కూర్చున్నారు తోషిబా, చిన్‌లీ. ద్వారానికి అటూ, ఇటూ పేష్కబ్జ్‌లను పట్టుకుని ద్వారపాలకుల్లా నిలబడ్డారు ఆ యిద్దరు అనుచరులూ.

"ఢాం....! ఢాం....! ఢాం....!"

రివాల్వర్ల మ్రోతతో ఆరామం మారుమ్రోగిపోయింది. ఆరామం చూరుకు నల్లని ముత్యాల్లా వ్రేలాడుతున్న రాక్షస గబ్బిలాలు మూడు తూటాలకు నేలకూలాయి. ఆ శబ్దాలకు మిగిలినవి కీచుమని అరుచుకుంటూ ఆరామం

లోపల డెస్పరేట్ గా తిరగసాగాయి.

మరోసారి వారి రివాల్వర్స్ గర్జించాయి. ఈసారి మరికొన్ని నేలమీదకు రాలిపోయాయి. ఒక్కొక్కటి మరణిస్తూంటే రెట్టించిన ఉత్సాహంతో వారు కాల్పులు కొనసాగించారు.

ఈసారి రెండు గబ్బిలాలు కాల్పులు వస్తున్న దిశను శబ్దాన్నిబట్టి గ్రహించాయి కాబోలు రివ్వుమంటూ ద్వారం వైపు దూసుకువచ్చాయి.

ద్వారం దగ్గర కాచినవారు షేమ్క్ వ్లతో వాటిని ఒక్క వేటుకు నరికారు. నల్లని వాటి శరీరాలు ఎర్రని రక్తంతో తడిసి భయానకంగా వున్నాయి.

రాక్షస గబ్బిలాలను వేటాడుతున్న ఉత్సాహంతో వారు మరోవైపు నుండి వస్తున్న ప్రమాదాన్ని గుర్తించలేకపోయారు.

వ్యాలీ పర్వత శిఖరంమీదగుండా కోస్టల్ గార్డింగ్ కు వెళుతున్న సీ హంటర్ ఆకాశంలోనే ఆ పర్వత శిఖరం చుట్టూ చక్కర్లు కొట్టసాగింది.

బైనాక్యులర్స్‌తో ఆ పర్వత శిఖరాన్ని పరిశీలించడం మొదలు పెట్టిన ఆ సైనికులకు శిథిలారామం ప్రాంగణంలో పొంచి వున్న హోచిమిన్ బృందం కనిపించింది. అంతే! వార్నింగ్ సైతం యివ్వకుండా వారు ఫైరింగ్ ఓపెన్ చేశారు.

వర్షంజల్లులా తమ చుట్టూ పడుతున్న బుల్లెట్ల శబ్దానికి వారు ప్రక్కలో బాంబు ప్రేలినట్లు అదిరిపోయారు. చటుక్కున ఆరామం ప్రాంగణంలోని రాతి స్థంభాల చాటుకు దొర్లుకుంటూ పోయాడు హోచిమిన్.

చెంగున ఆరామంలోకి దూకి నేలమీద బోర్లా పడు

కున్నాడు చిన్ లీ. తోరణ ద్వారం చాటున తప్పుకున్నాడు తోషిబా.

మిగిలిన యిద్దరు అనుచరులుకూడా ఆ దేవాలయం లోనికి దుముకబోయారు. కాని వారు కదలడం కాస్త ఆలస్యమయింది. తోరణ ద్వారంవైపు మొదటి అడుగు వేయక ముందే వారి శరీరం బుల్లెట్ల తాకిడికి తూట్లుపడి పోయింది.

నిర్జీవంగా నేలమీదకు వ్రాలిపోయిన వారి వంక బాధగా చూశాడు తోషిబా.

ఈ మధ్యలో రాతి స్థంబాల చాటున దాక్కున్న హోచిమిన్ భుజంమీద నున్న కిట్ తీసి. అందులోని విడి భాగాలను చక, చకా బిగించసాగాడు. కొద్ది నిమిషాలలో ఆతని చేతులలో అత్యంత ఆధునికమైన జర్మన్ మేడ్ మిషీన్ గన్ తయారయ్యింది. బుల్లెట్ చైన్‌ను ఇన్ సర్టు చేసి....తమ మీద గుళ్ళ వర్షాన్ని కురిపిస్తున్న సీహాంటర్ కు గురిపెట్టాడతడు.

ఇలాంటి పరిస్థితే వచ్చి, జపాన్ · రక్షణదళాలను యెదుర్కొనవలసివస్తే, దానికికూడా సిద్ధపడే వచ్చాడతను. ఒక్క మిషన్‌గన్ మాత్రమేకాకుండా యింకా హై పవర్ హాండ్ బాంబ్స్‌కూడా అతని కిట్‌లో వున్నాయి.

అతడు ఫైరింగ్ ఓపెన్ చేశాడు.

ఎదురుకాల్పులు ఆరంభమయ్యాయని గ్రహించినంతనే ఒక్కసారిగా పైకి ఎగిసి ఆకాశంలో రెండుసార్లు చక్కర్లు కొట్టింది ఆ సీహాంటర్. తరువాత యేటవాలుగా ఆ ఆరామంమీద నుండి మాసుకుంటూ పోయింది.

హోచిమిన్ దాక్కున్న రాతి స్థంభాలపై బుల్లెట్లు

వర్షంలా కురిసాయి. రాతి పెచ్చులు ఊడి గాలిలోకి ఎగిరాయి. ఓ ప్రక్క బుల్లెట్లనుండి కాచుకుంటూ ఒక రాతి స్తంభం చాటునుండి తిరుగుతూ ఆ సీ హాంటర్ మీదకు గుళ్ళ వర్షాన్ని కురిపించాడు హోచిమిన్.

కాని వేగంగా దూసుకుపోయిన సీహాంటర్‌ను అతడు ఎయిమ్ చేయలేకపోయాడు.

వెళ్ళినంత వేగంగానే తిరిగివచ్చి ఫైర్ చేస్తూ దూసుకుపోయింది సీహాంటర్. డెస్పరేట్ గా అది వెళ్ళిన దిశలో గాలిలోకి కాల్పులు సాగిస్తూనే ఉన్నాడు హోచిమిన్.

అలా ఆ పోరాటం కొన్ని నిమిషాలపాటు సాగింది. చిన్ లీ, తోషిబాలు భయంగా ఆ పోరాటాన్ని తిలకిస్తున్నారు.

ఉన్నట్లుండి ఆ సీహాంటర్ వేగంగా వెనుతిరిగి వెళ్ళిపోసాగింది. బహుశా అదనపు బలాలను సమకూర్చుకొని రావడానికేమో అనుకున్నాడు హోచిమిన్.

ఏది యేమైనా కొంతసేపటివరకూ తమకు దానివలన ప్రమాదం లేనట్లే. అతడు చేతిలో మెషిన్ గన్‌తో ఆరామం లోపలకు పరుగెత్తాడు.

“కమాన్! దేర్ ఈస్ నో టైమ్. హర్రీయప్” అంటూ ఆ విగ్రహాన్ని సమీపించాడు.

ఒక పెద్ద శిలాఫలకానికి తాపడం చేయబడి వుంది ఆ విగ్రహం.

యిప్పుడు ఆ ఫలకాన్ని జాగ్రత్తగా బద్దలుకొట్టే టైం లేదు. మళ్ళీ జపాన్ కోస్టల్ గార్డ్సు వచ్చేలోగా తాము తప్పించుకోవాలి.

ఒక్క నిమిషం సాలోచనగా ఆ విగ్రహం వంక చూశాడు. జేబులోనుండి రేగుపండు సైజులో వున్న

చిన్న మినీ బాంబ్‌ను తీశాడు. కేవలం చిన్న చిన్న రాతి పలకలను మాత్రం ముక్కలు చేయగలదు ఆ మినీ బాంబు.

వేలితో దానికున్న బుడిపెను నొక్కి ఆ శిలాఫలకం వద్ద పెట్టి ఆరామం బయటకు పరుగెత్తాడు హోచిమిన్. అతన్ని వెన్నంటారు మిగిలిన యిద్దరూ.

ఒకటి... రెండు.... మూడు....

సరిగ్గా పది అంకెలు లెక్క పెట్టేసరికి 'ధన్'మని శబ్దం చేస్తూ పేలింది ఆ బాంబు. ముక్కలు చెక్కలుగా గాలిలోకి ఎగిరిపోయింది ఆ శిలా ఫలకం.

ఛిన్నా భిన్నమైన ఆ శిలా శకలాల మధ్య పడి వున్న బుద్ధ విగ్రహం వంక ఆనందంగా చూస్తూ ముందుకు అడుగు వేశాడు హోచిమిన్.

అప్పుడు వినవచ్చింది వారికి ఒక భయంకరమైన శబ్దం. ఆ విస్ఫోటానికి పూర్తి పర్వతమే మొత్తం కదిలిపోయింది. శిథిలారామం ఒక్క క్షణం గడ, గడ వణికి పేక మేడలా కూలిపోసాగింది.

కుప్ప కూలిపోతున్న ఆరామాన్ని చూస్తూనే 'కవ్వు' మని కేక వేస్తూ బయటకు పరుగెత్తారు వారు.

దోసిళ్లతో పూలను వెదజల్లినట్టు, పెద్ద పెద్ద రాతి పలకలు ఆశ్చర్యంగా గాలిలోకి ఎగిసి పడ్డాయి.

చిన్న మినీ బాంబే యింతటికీ కారణమయ్యిందంటే వారు నమ్మలేక పోతున్నారు. జరిగిందేమిటో.... అదెలా సంభవించిందో వారికేం అర్థం కావటంలేదు.

ఇంతలో ఆ శిథిలాలనుండి బుస, బుసా పొంగుకుంటూ వస్తున్న ద్రవాన్ని చూసేసరికి వారికి ఈ ప్రళయం ఎలా సంభవించిందో అర్థమయిపోయింది.

"అగ్ని పర్వతం బ్రద్దలయ్యింది."

ముగ్గురి నోళ్ళ నుంచీ ఒకేసారి వచ్చిందా మాట.

'అంటే.... ఫ్యూజీ యాక్టింగ్ వాల్కనో యన్న' మాట ఆ ద్రవం వంకే నిశ్చేష్టులై చూస్తూ అనుకున్నాడు తోషిబా.

అయితే పొంగుకుంటూ, పొర్లుకుంటూ వస్తున్న ఆ ద్రవం లావా కాదు.... లహారి.

అగ్నిపర్వతం బ్రద్దలయి చల్లారిన మాగ్మా లేక లావాకు బదులు ఒక్కొక్కసారి బురద ప్రవహిస్తూం టుంది. ఆ బురదనే లహారి అంటారు.

1945 నవంబరు 13 న అర్మెరోలోని నెవడో డెల్ రూయిజ్ అగ్నిపర్వతం బ్రద్దలయి, దానినుంచి ప్రవ హించిన బురద మట్టిలో 28 వేలమంది ప్రజలు కూరుకు పోయి మరణించారు.

బురదమట్టి నెమ్మదిగా పేరుకుపోవడంతో వేలాది శవాలు బురదమట్టి ముద్దల క్రింద ఉండిపోయాయి.

ఇప్పుడు ఎండిపోయిన ఆ బురదమట్టి ప్రవాహం ఏడు ఎకరాల్లో వ్యాపించి వుంది.

అర్మెరోలో జరిగిన ఆ దారుణ ఉదంతం గుర్తుకు వచ్చి భయంతో వణికిపోయారు వారు.

బూడిదను, రాళ్ళను ఎగజిమ్ముకుంటూ వస్తున్న ఆ లహారి ప్రవాహాన్ని చూసేసరికి వారి పై ప్రాణాలు పైనే పోయాయి.

పిచ్చిగా కేకలు వేసుకుంటూ పరుగెత్తారు వారు.

కొన్ని సెకన్లలో.... మహోద్రుత జలపాతంలా, టైఫూన్లో ముంచెత్తి వచ్చే ఉత్తుంగ సాగర తరంగంలా పొంగి పొర్లుతూ వస్తూంది ఆ లహారి ప్రవాహం.

హోలీ పండుగలో బుక్కా విసురుకుంటున్నట్లు ... బూడిద ఎగిసి ఆకాశాన్ని కప్పేస్తూంది. చిన్న, చిన్న రాళ్ళు బండలూ బంతుల్లా ఎగిసి పడుతున్నాయి.

ఎర్రగా, చిక్కగా పొంగులు వారుతున్న ఆ లహరి ప్రవాహాన్ని చూస్తుంటే ప్రళయమే ముంచుకువచ్చిందా అనిపిస్తూంది.

ప్రాణాలు అరచేతులలో పెట్టుకొని పరుగెత్తుతున్నారు వారు. వారిని వెన్నాడుతున్న మృత్యువులా వెనుక పరవళ్ళు త్రొక్కుకుంటూ వస్తూంది ఆ ప్రవాహం.

ఎంతసేపని...? ఎంత దూరమని వెంటాడే మృత్యువును తప్పించుకొని వారు పారిపోగలరు?

చిన్ లీ పాదాలను తాకుతూ హాంచిమిన్ ను చుట్టుముట్టింది ఆ లహరి. అప్పటికి పర్వతపు అంచునున్న బండ మీద వున్నాడు తోషిబా.

చిన్ లీ, హాంచిమిన్ లు కాళ్ళు విదలించబోయారు. కాని బంకలాంటి ఆ బురద నీటిలో వారికది సాధ్యం కాలేదు. ఒక్కొక్క సెకను గడిచేకొద్దీ ఆ మట్టం పెరగసాగింది.

పాదాలనుండి, మోకాళ్ళను దాటి. తొడలను చుట్టి యింకా....యింకా.... పైపైకి మెల్లగా పెరుగుతూంది ఆ బురద ప్రవాహం.

తాను నిలుచున్న బండనుండి వారివైపు జాలిగా చూశాడు తోషిబా. ఈ క్షణంనుండి వారు అనుభవించబోయే నరకయాతన గుర్తుకు వచ్చేసరికి అతడి ముఖంలో రక్తం యింకిపోయింది.

అప్పుడే తను నిలుచున్న బండనుకూడా చుట్టుముట్టి

పైకి వెల్లిగా పెరుగుతున్న బురద నీటి మట్టాన్ని గమనించాడతడు. ఏం చేయాలో తోచక వెర్రివాడిలా జుత్తు పీక్కుంటూ నిస్సహాయంగా కేకలు పెట్టాడు తోషిబా.

అప్పటికి చిన్ లీ, హోచిమిన్‌ల కంఠం వరకూ వచ్చింది ఆ బురద నీటిమట్టం.

'నో. పగవాడికి కూడా ఆ చావు రాకూడదు' అనుకున్నాడు తోషిబా.

వెల్లిగా బండను ముంచెత్తిన బురద ప్రవాహం అతని పాదాలను తాకింది.

అంతే! వేయి కాలనాగులు, ఒక్కసారి తనను చుట్టి ముట్టినట్టు కంపించిపోయాడతడు.

చివరిసారిగా గొంతు లవరకూ మునిగిపోయిన హోచిమిన్, చిన్ లీలను చూశాడు.

"అనుక్షణం.. వారిలా చిత్రవధ అనుభవిస్తూ చావడం కన్న ఒకేసారి చావడం మేలు" అనుకున్నాడు.

అంతే! ఒక్క ఉదుటున ఆ పర్వత శిఖరంనుండి క్రిందకు దుమికాడు. రాతిబండలకు తగిలి అతని శరీరం ఛిన్నాభిన్నమయింది.

—: అయిపోయింది :—